

జిల్లా పోలీసు కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

# పరేడ్ గ్రౌండ్ పనులను వేగవంతం చేయాలి

- రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి
- జిల్లా పోలీస్ కార్యాలయ భవన నిర్మాణ పనుల పరిశీలన

సూర్యాపేట సిటీ, జూన్ 19 : సూర్యాపేటలో నిర్మిస్తున్న జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో ఫరేడ్ గ్రౌండ్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ భవనాన్ని మంత్రి పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.8.50కోట్లతో పోలీస్ కార్యాలయం రూపుదిద్దుకుంటున్నట్లు తెలిపారు. వర్షాకాలం వస్తున్నందున పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్షపు నీరు బయటకు వెళ్లేలా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఇంజినీరింగ్ కళాశాల కనెక్టింగ్ రోడ్ నుంచి కార్యాలయం వరకు 60ఫీట్ల రోడ్డును నిర్మించాలని ఆదేశించారు. త్వరలో రివ్యూ సమావేశం నిర్వహించాలని మంత్రి జగదీశ్‌రెడ్డి నిర్ణయించారు. మంత్రి వెంట రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అబ్దుల్ కుతుస్ హుస్సేని, డీఈ సుందర్, ఏఈ బాలరాజ్, డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర్‌రెడ్డి, రవి, ఎస్‌బీ సీఐ తుల శ్రీనివాస్, నరసింహారావు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి

- జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి శ్రీధర్‌గౌడ్



నాగారంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న శ్రీధర్‌గౌడ్

నాగారం, జూన్ 19 : నీటి వసతి గల రైతులు ఆయిల్‌పామ్ మొక్కల సాగుపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి బెల్లంకొండ శ్రీధర్‌గౌడ్ అన్నారు. హరితోత్సవంలో భాగంగా సోమవారం నాగారం మండలంలోని గోపాలపురంలో పులుగురి రాజేశ్వరం బలరాంరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒక ఎకరం వరి సాగు చేసుకునే నీటితో రెండున్నర ఎకరాల ఆయిల్ పామ్ సాగు చేసుకోవచ్చున్నారు. ఒకసారి మొక్క నాటితే 30 సంవత్సరాల వరకు దిగుబడినిస్తుందని, నాటిన నాలుగో సంవత్సరం తరువాత పంటకోత మొదలవుతుందన్నారు. ఒక ఎకరంలో సగటున 8 నుంచి పది టన్నుల దిగుబడి వస్తుందని తెలిపారు. సంవత్సరం వయసున్న మొక్కలను త్రికోణకార, చతురస్రాకార పద్ధతిలో నాటుకోవాలని, రెండు ఫీట్ల లోటు గుంతలు తవ్వాలని ఎకరానికి 57 మొక్కలు నాటుకోవచ్చున్నారు. మొదటి మూడు సంవత్సరాల వరకు అంతర పంటలు సాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రాయితీ కింద మొక్కలు, బిందు సేద్యం పరికరాలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ జిల్లా అధికారి వీరకుమార్, ప్రాంతీయ ఉద్యాన అధికారులు కన్న జగన్, స్రవంతి, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ రాష్ట్ర డివిజన్ మేనేజర్ జె.హరీశ్ పాల్గొన్నారు.

### అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

రామగిరి, జూన్ 19: నల్లగొండలోని డైట్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ బీఈడీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ మునాఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెథడాలజీలతోపాటు ఆరోగ్య, వ్యాయామ విద్య, దృశ్య కళలు, కళావిద్య, కంప్యూటర్, ఐసీటీలో మొత్తం 11 ఖాళీలున్నట్లు వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు పూర్తి సమాచారంతో బయోడేటా, జిరాక్స్ సర్టిఫికెట్ల దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.



అర్వపల్లిలో మొక్కలకు నాటి నీళ్లు పోస్తున్న ఎంపీపీ మన్నె రేణుక, జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్



తిరుమలగిరిలో హరిత దినోత్సవంతో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి

# హరితహారంతో ఆహ్లాదకరం

- మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ సావిత్రి
- ఘనంగా హరితోత్సవం

మోత్కూరు, జూన్ 19 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంతో పల్లెలు, పట్టణాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొన్నదని మున్సిపల్ చైర్ పర్సన్ తీపిరెడ్డి సావిత్రీ మేఘూరెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో హరిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని అనాజిపురంలో జడ్పీటీసీ గోరుపల్లి శారదాసంతోష్‌రెడ్డి, సర్పంచ్ ఉప్పల లక్ష్మి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటయ్య, కమిషనర్ శ్రీకాంత్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మోత్కూరులో మొక్క నాటి నీళ్లు పోస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘూరెడ్డి



మద్దిరాల : మండలకేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కనగల్: మొక్క నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

# గ్రామీణాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా, జూన్ 19 : గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. అనుముల మండలం యాచారం గ్రామంలో ఆదివారం రాత్రి ఎమ్మెల్సీ నిధులు రూ. 5 లక్షలతో నిర్మించనున్న మట్టిరోడ్డు పనులను ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. నాగార్జున సాగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ పంచాయతీల్లో 30 నుంచి 50 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాలకు కొత్త శోభ వచ్చిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. ప్రజలు బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అండగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సుమతీపురుషోత్తం, సర్పంచ్ చెదురుపల్లి రాములు గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు రవీందర్‌రెడ్డి, నరేందర్ రావు, పీఏసీఎస్ డైరెక్టర్ ఇరిగి శ్రీను, వేముల కోటయ్య, వెంకన్న, నిమ్మల డాకాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీను, ఈదయ్య పాల్గొన్నారు.

# రేపు డీఈఈ సెట్ సర్టిఫికెట్ల పరిశీలన

రామగిరి, జూన్ 19 : 2023-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించిన 'డీఈఈసెట్-2023' లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ నర్సింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 సాయంత్రం 5 గంటల వరకు డైట్ లో నిర్వహించే పరిశీలనకు విద్యార్థులు డీఈఈసెట్ హాల్‌టికెట్, ర్యాంక్ కార్డు, కుల, ఆదాయ సర్టిఫికెట్లు,ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు జిరాక్స్ సెట్ తీసుకుని రావాలని సూచించారు.

### మంత్రి కేటీఆర్ సభను విజయవంతం చేయాలి

అర్వపల్లి, జూన్ 19 : ఈ నెల 24న తిరుమలగిరిలో జరిగే రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్ బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని రామన్నగూడెం ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు పాల్గొని కేటీఆర్ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, నాయకులు లక్ష్మనర్సయ్యయాదవ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### ఎంజీయూ డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు

రామగిరి, జూన్ 19 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనుబంధ కళాశాల్లో డిగ్రీలో నూతన కోర్సులు అందుబాటులోకి వచ్చినట్లు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సీహెచ్.గోపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్ ఆనర్స్, బీకాం ఆనర్స్ (4 సంవత్సరాలు), బీబీఏ లాజిస్టిక్స్ కోర్సులు(3 సంవత్సరాలు) అందుబాటులోకి వచ్చాయన్నారు. 2023-24 సంవత్సరం డిగ్రీ అడ్మిషన్లకు నిర్వహిస్తున్న దోస్త్‌లో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### ఘనంగా గంగమ్మ పండుగ

తిప్పర్తి, జూన్ 19 : యాదవుల ఆరాధ్య దైవం గంగమ్మ పండుగ మండలకేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిప్పర్తి జడ్పీటీసీ పాశం రాంరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రొట్టెల రమేశ్, నాయకులు మోష, ఎన్ .శ్రీనివాస్, ఉయ్యాలనాగరాజు, పెద్దగొల్ల సాయిలు పాల్గొన్నారు.